క్లుప్తంగా

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట



శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామం కాశిరెడ్డి ఆశ్రమంలోని బృందావన క్షేత్రంలో ఆదివారం శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహదాతలు సందీప్‌కుమార్‌రెడ్డి, అంజలి దంపతులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, జంగం సంజమ్మ, బొందెలి భవాన్ సింగ్, గని ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరుల పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో లారీ దగ్ధం



మంటలో కాలిపోతున్న లారీ

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె-సిమెంట్‌నగర్ ఘాట్‌లో ఆదివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో లారీ కాలిబూడిదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నంద్యాలకు చెందిన ఏపీ 04ఎక్స్9003 నంబర్ లారీ నంద్యాల నుంచి బేతంచెర్లకు బయలుదేరింది. తమ్మరాజుపల్లె సమీపాన సిమెంట్ నగర్ ఘాట్ ఎక్కే సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో లారీలో మంటలు చెలరేగాయి. హైవే పెట్రోల్ పోలీసుల సమాచారం మేరకు అక్కడికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

పూడిచెర్లలో భగవద్గీత ప్రచారం



కరపత్రాలు పంచుతున్న కమిటీ సభ్యులు

ఓర్వకల్లు: మండలంలోని పూడిచెర్ల గ్రామంలో ఆదివారం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లె కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత అచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రాముఖ్యతను సభ్యులు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పుల్లారెడ్డి, కుమారాచారి, నాగమద్దిలేటి, సంజీవ, గిరిబాబు, మనోహర్, పార్థసారిధి, కృష్ణవేణమ్మ, నాగలక్ష్మమ్మ, లక్ష్మీనారాయణ, రాణెమ్మ, చందు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విలేకరి మృతి

గడివేముల: మండల కేంద్రం గడివేముల మండలంలో ఓ పత్రికా విలేకరి షేక్ మహబూబ్ బాషా (46) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. తెల్లవారు జామున వాకింగ్ చేస్తుండగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, చంద్రశేఖరరెడ్డి తదితరులు విలేకరి మృతిపట్ల సంతాపం తెలిపారు.

విష్ణు సహస్రనామ పారాయణం



ప్రత్యేక అలంకారంలో గోదా దేవి

కర్నూలు కల్చరల్: ధనుర్మాస పూజల్లో భాగంగా ఆదివారం కర్నూలు నగర శివారులోని గోదా గోకులంలో అఖండ విష్ణు సహస్రనామ పారాయణ సప్తాహం కార్యక్రమం ప్రారంభమైంది. మార్గశిర బహుళ సప్తమి పురస్కరించుకొని వందలాది మంది గోదా గోకులం పరివారం పూజల్లో పాల్గొని పారాయణం చేశారు. వేద పండితులు శాస్త్రోక్తంగా రంగనాథ, గోదా దేవిలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త మాట్లాడుతూ.. విష్ణు సహస్రనామ పారాయణం ఈనెల 29వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని జనవరి 15వ తేదీ వరకు గోదా గోకులంలో పలు పూజ క్రతువులు జరుగుతాయన్నారు. గోదా గోకులం ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అఖండ విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

పల్లెల్లో 'క్రిస్మస్' వెలుగులు



సి.బెళగల్ ప్రధానరోడ్డులో ఏబీఎం చర్చి సమీపలంలో ఏర్పాటు చేసిన లైటింగ్ స్టార్



కంబదహాల్ చర్చి ప్రధాన రహదారిలో ఆకట్టుకుంటున్న స్టార్ లైట్



పలుకుదొడ్డిలో ప్రధాన రోడ్డులో లైటింగ్ స్టార్

సి.బెళగల్: పల్లెల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. ఈ నెల 25 క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధల నిర్వహించనున్న నేపథ్యంలో చర్చిలు ముస్తాబు అవుతున్నాయి. క్రైస్తవులు గృహాలను అలంకరిస్తున్నారు. ఇళ్లపై స్టార్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామగ్రామానా స్టార్ల రూపంలో పర్వదినం వెలుగులు మెరుస్తున్నాయి. లైటింగ్ స్టార్ల వెలుగులు తళుక్కుమంటున్నాయి. మండల కేంద్రం సి.బెళగల్లోని ఎమ్మిగనూరు - గూడూరు ప్రధాన రోడ్డులోని ఏబీఎం చర్చి దగ్గర చర్చి నిర్వహకులు ఏర్పాటు చేసిన లైటింగ్ స్టార్ చూపరులను ఆకట్టుకుంటుంది. అదేవిధంగా కంబదహాల్ గ్రామంలోని చర్చి దగ్గర ప్రధాన వీధిలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన రంగు రంగుల స్టార్ ఆకట్టుకుంటున్నాయి. పలుకుదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని మెయిన్ రోడ్లపై ఏర్పాటు చేసిన లైటింగ్ స్టార్లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. 24వ తేదీ అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభం కానున్న నేపథ్యంలో చర్చీలను సుందరంగా అలంరిస్తున్నారు నిర్వాహకులు. మూడురోజులు ముందుగానే పండగ వాతావరణం కనిపిస్తుంది.

టమాట రైతులు చిత్తు!

- పూర్తిగా పడిపోయిన ధరలు
- 25 కిలోల బాక్స్ రూ.170
- కూలీలు గిట్టుబాటవ్వని వైనం
- పంటను పొలంలోనే వదిలేసిన రైతులు



పాడిదెంపాడు గ్రామంలో గొర్రెల మందకు వదిలేసిన టమాటా

కర్నూలు (రూరల్) : అన్నదాతలను సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులు రైతులను ముంచేస్తున్నాయి. ప్రత్యేకించి ఈయేడు తుపాన్ రైతులను కన్నీరు పెట్టించింది. ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్ సైతం ఏ మాత్రం కలిసి రాలేదు. టీడీపీ కూటమి సర్కార్ పెట్టుబడి సాయం కూడా అందజేయకపోవడంతో అన్నదాతలు నేలచూపు చూస్తున్నారు. చివరకు సిరులు కురిపించే టమాట సైతం రైతన్నను చిత్తు చేసింది. ధర పూర్తిగా పతనం కావడంతో టమాట రైతు అయోమయానికి గురువుతున్నారు. కర్నూలు మండల పరిధిలోని నూతన పల్లె, పడిదెంపాడు, నందనపల్లె, గార్గేయపురం, పి.రుద్రవరం గ్రామాలలో రైతులు టమాటను ఎక్కువగా సాగు చేస్తారు. టమాట పంటపై ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలింది. పెట్టుబడి విషయం అటుంచితే టమాటలు కోతలు కూలీలు, రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటవ్వని దుర్భర పరిస్థితులు ఎదుర్కుంటున్నారు. వాస్తవానికి వాతావరణం ప్రతికూల పరిస్థితులు, అధిక వర్షాల మూలంగా తెగుళ్లసోకి టమాట పంట దెబ్బతినింది. అష్టకష్టాలు ఎదుర్కుని వేలకు వేలు ఖర్చు చేసి పంటనుకాస్తా కాపాడుకున్నారు. అయితే ఒక్కసారిగా ధరలు పడిపావడం రైతులను కలవరానికి గురి చేస్తుంది. టమాట మార్కెట్‌లో శనివారం 25 కిలోల బాక్స్ రూ.170 రూపాయలకు విక్రయించారు. కిలో రూ.7 రూపాయలలోపే ధర పలికింది. ఈ ధరకు విక్రయిస్తే కూలీలు,రవాణా ఖర్చులు కూడా గిట్టని పరిస్థితి. దీంతో రైతులు పంటను పొలంలోనే వదిలేశారు.

తగ్గిన టామాట సాగు విస్తీర్ణం

కర్నూలు మండలలో టమాట సాగు విస్తీర్ణం తగ్గింది. ఖరఫ్ సీజన్‌లో 64.36 హెక్టార్, రబీలో 12 హెక్టర్లు సాగు నమోదు అయినట్లు అధికారుల అంచనా. ఉచిత పంటల బీమా వర్తింపులేనందునే సాగు విస్తీర్ణం తగ్గిందటున్నారు రైతులు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచితంగా బీమా వర్తింపజేయగా ప్రస్తుత కూటమి సర్కార్ ఆ విధానానికి స్వస్తి పలికింది.



గార్గేయపురంలో టమాటా పంటను కోయకుండా వదిలేసిన దృశ్యం

రబీలో సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం రైతులే చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు నిరాశకు గురువుతున్నారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో బీమా ప్రీమియం భారం తగదని కూటమి సర్కార్ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు రైతులు.

అప్పులు మిగిలాయి



ఒక ఎకరం టమాట పంట సాగుచేశాను. ఎంతో ఆశగా టమాట సాగు చేస్తే చివరికి అప్పులు మిగిలాయి. ధర పూర్తిగా పడిపోయింది. కర్నూలు రైతు బజార్‌లో కేజీ రూ.6గా ధర నిర్ణయించారు. 25 కిలోల టమాట బాక్స్ అమ్మితే రూ.160 నుండి రూ.170 వస్తాయి. రవాణాచార్జీ రూ.25, రూ.30 ఉంటుంది. టమాట పంటను కోయడానికి ఒక్క కూలీకి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. కూలీలు, రవాణా చార్జీలు కూడా రానందున పంటను గొర్రెల మందకు మేతగా వదిలివేశాను. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– నాగమద్దిలేటి, రైతు, పడిదెంపాడు

భారీగా నష్టం



మూడు ఎకరాల్లో టమాట సాగు చేశా. లక్ష రూపాయలు పైగా పెట్టుబడి పెట్టా. టమాట పంటకు ధర పలికినప్పుడు పంటదిగుబడి రాలేదు. అధిక వర్షం వలన పూత, పిందెలు రాలిపోయాయి. ఇప్పుడేమో దిగుబడి వచ్చింది ధర లేదు. పంటను మార్కెటకు తీసుకెళ్తామంటే కూలీ, రవాణ ఖర్చులురాని పరిస్థితి. దీంతో టమాట పంటను పొలంలోనే వదిలిపెట్టా. భారీగా నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందజేస్తే బాగుంటుంది.

– రామస్వామి, రైతు, గార్గేయపురం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఈఓ రామక్రిష్ణ

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరులో వెలిసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో సామివారికి అభిషేకాలు, అర్చనలు, పాలాభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలన్నారు.

ఆర్‌యూలో రామానుజన్ జయంతి



రామానుజన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, అధ్యాపకులు

కర్నూలు కల్చరల్: ప్రపంచ ప్రసిద్ధి చెందిన గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని రాయలసీమ విశ్వవిద్యాలయం గణిత శాఖాధ్యక్షుడు ఆచార్య పి.వి.సుందరానంద్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా వర్సిటీలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణిత శాస్త్రంలో విస్తృత పరిశోధనలు చేసిన రామానుజన్ జన్మదినం డిసెంబర్ 22ను భారత ప్రభుత్వం జాతీయ గణిత దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. రామానుజన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు 20వ శతాబ్దపు గణిత మేధావుల్లో ఆయనకు సుస్థిర స్థానాన్ని ఏర్పరచాయన్నారు. వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ సి.విశ్వనాథ్‌రెడ్డి, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆర్.భరత్‌కుమార్ మాట్లాడారు. గణిత విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం.వీరకృష్ణ, డాక్టర్ ఎస్వీ సునిత, డాక్టర్ యు.నాగిరెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి



శరీన్‌నగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగునీటిని చూపిస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ కాలనీలో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శరీన్‌నగర్, వెంకటేశ్వర నగర్‌లో మురుగు కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై నిలిచి దోమలు, ఈగలతో ప్రజలకు వైరల్ జ్వరాలు సోకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి పన్ను వసూళ్లు చేస్తున్న మున్సిపల్ అధికారులు మౌలిక వసతులు కల్పించడంతో విఫలమవుతున్నారన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్లపై మురుగు నీరు లేకుండా డ్రైనేజీలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నూర్జహాన్, జరీనాబి, వసంతమ్మ, సులోచన, జయలక్ష్మి, లలిత, ఎస్తేరమ్మ, సుంకులమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు



శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు(అగ్రికల్చర్): విశ్రాంత ఉద్యోగులు తరచూ బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని ఏపీ ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం కర్నూలు శాఖ అధ్యక్షుడు రంగారెడ్డి సూచించారు. స్థానిక అబ్బాస్ నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం సాయి సత్య హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో 150 మందికి ఎముకల సాంద్రత పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. రోబో మిషన్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు పలువురికి టోకెన్‌లు జారీ చేశారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏపీజీఆర్ఈఏ కర్నూలు శాఖ అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు సంఘం పెద్దపీట వేస్తుందన్నారు. ఏపీజీఆర్ఈఏ జనరల్ సెక్రటరీ జయచంద్రారెడ్డి, సంఘం ప్రతినిధులు మల్లికార్జున,విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ గణిత దినోత్సవం

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీ గణిత విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ పాల్గొని భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గణిత విభాగాధిపతి టి.చంద్రశేఖర్, గణిత అధ్యాపకులు డా.ఓబులేసు, ఎస్.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

కర్నూలు(సెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్‌చేశారు. ఆదివారం కళావెంకట్రావు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే అమిత్‌షాకు మంత్రి పదవి దక్కిందన్నారు. లేకపోతే రాచరికం అమల్లో ఉండేదన్నారు. అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేస్తూనే ఉంటుందని, అందులో భాగంగా సోమవారం బాబాసాహెబ్ అంబేడ్కర్ సమ్మాన్ మార్చ్‌ను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడుషేక్ జిలానీబాషా, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరాటాలకు సిద్ధం కావాలి



ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకుంటున్న నాయకులు

కోడుమూరు రూరల్: విద్య, వైద్యం, ఉపాధి సాధనలో భాగంగా యువత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి పిలుపునిచ్చారు. కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా కారుమంచి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కల్పించకుండా మతం పేరుతో రాజకీయాలు చేస్తూ యువతను తప్పుదారి పట్టిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం 6నెలలు గడిచినా డీఎస్సీపై పూర్తిగా నిర్ణయం తీసుకోకుండా నిరుద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తోందన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి గ్రూప్-1,2, పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీని వారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజు, నాయకులు శేషుకుమార్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్, నాయకులు సిద్ధు, శ్రీకాంత్, అల్తాఫ్, కిషోర్, మునిస్వామి, కిరణ్, మల్లి, వీరేంద్ర, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారా.. మజాకా!

- ఓ మున్సిపల్ అధికారి నిర్వాకం
- మురుగు కాల్వకు స్థలం వదలకుండా కబ్జా
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



రోడ్డుకు ఓ వైపు కాల్వ ఉండగా మరోవైపు కాల్వకు స్థలం వదలకుండా చెట్లు నాటి కంచె వేసిన దృశ్యం

కర్నూలు (టౌన్): ఆయనో మున్సిపల్ అధికారి. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేశారు. ఇప్పుడు బదిలీ అయ్యారు. అధికారి కదా? తననెవరు అడుగుతారని ఇంటి పక్కన మురుగు కాల్వకు స్థలం ఇవ్వకుండా చెట్లు, ఫెన్సింగ్ వేసుకున్నాడు. కాల్వ ఉండాల్సిన చోట వీటిని ఏర్పాటు చేసుకున్నాడు. కాలనీలోని మాస్టర్ ప్లాన్ ప్రకారం 40 అడుగుల రోడ్డు ఉంది. ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించాలి. అయితే ఒక వైపు మాత్రమే ఉంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లు నిర్మించుకున్నా కాల్వలు లేక దుర్వాసన, దోమలతో రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లా కలెక్టర్ స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

17వ వార్డులో పరిస్థితి ఇదీ

నగరపాలక సంస్థ పరిధిలోని 17వ వార్డు చాణిక్యపురి కాలనీ, మాంటిస్సోరి స్కూల్ వెనక భరత్ నగర్‌లో అనేక ఇళ్లు ఉన్నాయి. ఇదే లైన్‌లో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసి ఇప్పుడు ఇతర జిల్లాలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఇల్లు ఉంది. ఇంటి ముందు రోడ్డు పక్కన మురుగు కాల్వ ఉండాలి. ఆ స్థలాన్ని ఆక్రమించి చుట్టూ ఫెన్సింగ్ వేసుకున్నారు. మురుగునీరు ముందుకు పోయే పరిస్థితి లేదు. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురాగా అదిగో.. ఇదిగో అంటూ.. వాయిదా వేస్తున్నారు. కాలనీవాసులు మాత్రం తామంతా పన్నులు చెల్లిస్తున్నాం. మా సమస్యను ఎందుకు పట్టించుకోరు.. అని ప్రశ్నించడంతో ఎట్టకేలకు అధికారులు మున్సిపల్ ఇంజినీర్‌కు సమస్యను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంజినీర్ వచ్చి చూసి వెళ్లాడు. అంతే ఎక్కడి సమస్య అక్కడే ఉంది. సదరు ఆక్రమణదారు మున్సిపల్ అధికారి కదా అందుకే పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అవసరం ఉన్నా.. లేకున్నా.. ఏలాంటి ప్రయోజనం లేకున్నా.. అడ్డగోలుగా కల్వర్టులు నిర్మించారు. మున్సిపల్ కార్పొరేషన్ నిధులు దుర్వినియోగం చేశారు. నిధులు ఖర్చు చేశారు తప్పా స్థానికంగా కాలనీవాసుల ఇబ్బందులు మాత్రం పరిష్కారం కాలేదు. మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు, పోగైన చెత్త

బదిలీల్లో ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్) : వేసవి సెలవుల్లో నిర్వహించే బదిలీల్లో ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కార్యదర్శి శివయ్య కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మే 31న కటాఫ్ తేదీ తీసుకోవడం వల్ల 2023 జూన్ నెలలో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయలకు అవకాశం ఉండదని, దీని వల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. ఖాళీగా ఉన్న స్థానాలను దృష్టిలో ఉంచుకొని సీనియర్లకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, రంగనాయకులు, తిమ్మారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మిడుతూరు : నందికోట్కూరు- నంద్యాల రహదారిలోని విపనగండ్ల బాట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. ఎస్ఐ ఓబులేసు తెలిపిన వివరాల మేరకు నందికోట్కూరు పట్టనానికి చెందిన యువకుడు గోపీనాథ్ ద్విచక్ర వాహనంపై మిడుతూరు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వీపనగండ్ల బాట సమీపంలోని గోడౌన్ వద్ద మోటార్ బైకు అదుపు తప్పడంతో కింద పడ్డాడు. నందికోట్కూరు పట్టణం నుంచి వస్తున్న ఎస్ ఓబులేసు ప్రమాదం జరిగిన ఘటన చూసి 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

క్రీడల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): క్రీడల్లో విజేతగా నిలిచేందుకు కృషి చేయాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ రంగస్వామి సూచించారు. ఆదివారం స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో ఇవాంజిలికల్ సపోర్టింగ్ టీమ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీ లను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లాడుతూ.. ఈ పోటీ ల్లో బాలుర విభాగంలో 8 జట్లు, బాలికల విభాగంలో 4 జట్లు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. హాకీ సంఘం ఉపాధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌ను అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్): పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీలపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీని అరెస్టు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి పీటీ సాయిప్రదీప్ డిమాండ్‌చేశారు. ఆదివారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చివరకు రాహుల్‌గాంధీ ఫొటోలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను మోసం చేసిన కాంగ్రెస్‌కు అమిత్ షాపై విమర్శలు చేసే హక్కులేదన్నారు. బీజేపీకి అంబేడ్కర్ అంటే ఎంతో గౌరవం అని, ఆయన ఆశయ సాధనకు పార్టీ ఎప్పుడూ పనిచేస్తుందన్నారు. ఆ పార్టీ నాయకులు నవీన్‌కుమార్, మాలతి, వేల్పుల గోపాల్, త్రివిక్రమ్, శ్రీరాములు పాల్గొన్నారు.